క్లుప్తంగా

పీర్ల చావిడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం


కుర్లపల్లి గ్రామస్తులకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో పీర్ల చావిడి నిర్మాణానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులకు నగదు అందించారు. మండల ప్రజాప్రతినిధులు ద్వారా గ్రామంలో పాడైన పీర్ల చావిడి అభివృద్ధి కోసం సహాయం అందించాలని గ్రామస్తులు కోరటంతో, ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, కుర్లపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

అమడగూరు: మండల పరిధిలోని కర్ణాటక బార్డర్ ప్రాంతంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 10న సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అక్రమంగా డబ్బు, మద్యం తదితర వాటిని సరఫరా చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బిళ్లూరు క్రాస్, రామనాథపురం రోడ్డులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రెండు చెక్‌పోస్టులలో 12 మంది పోలీసులు విడతల వారీగా 24 గంటలూ విధుల్లో ఉంటారని తెలిపారు. డీఎస్పీ వాసుదేవన్, సీఐ నిరంజన్‌రెడ్డి చెక్‌పోస్టులను పరిశీలించారు.

ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతం చేయాలి


మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ యల్లప్ప

కొత్తచెరువు: పేదల వైద్యం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతం చేయాలని ఏరియా కోఆర్డినేటర్, ఆరోగ్యశ్రీ టీం లీడర్ యల్లప్ప తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఆరోగ్యశ్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీకి ఎంపికైన రోగులు ఆరోగ్యశ్రీని వినియోగించుకోవడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనా వారికి ఏవిధంగా సేవలు అందించాలన్న విషయాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలు 100 శాతం సంతృప్తి చెందేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేశారు. సూపర్‌వైజర్ గౌరీదేవి, కంబగిరి స్వామి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2 లక్షల విరాళం


గ్రామస్తులకు చెక్కు అందజేస్తున్న రమణనాయుడు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయానికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రమణనాయుడు రూ.2 లక్షల విరాళం అందజేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గోపాల్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదెప్పలకు ఆ మొత్తాన్ని అందజేశారు. జూన్ 1న ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవం ఉండటంతో అన్నదాన కార్యక్రమానికి నిధులు వెచ్చించాలని విరాళంగా అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుక్కపట్నం సర్పంచ్ నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డిలతో కలసి ఎంపీపీ 1, 2 సచివాలయాల సిబ్బందితో సమావేశమై సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం' లో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి


ధర్మవరం: ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


కదిరి: సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

ధర్మవరం: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 33వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పాల్గొన్నారు, ప్రతి ఇంటికీ వెళ్లి పేద ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు, ఈ సందర్భంగా పలువురు వార్డు ప్రజలు సాంకేతిక కారణాలతో వివిధ పథకాలు అందడం లేదని ఎమ్మెల్యేకు వివరించగా .. సచివాలయ సిబ్బందితో మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. ధర్మవరం పట్టణంలో 12 వేల మంది నిరుపేదలకు స్థలంతో పాటు గృహ నిర్మాణ సౌకర్యం కల్పించారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేల చొప్పున కార్మికులకు సాయం అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా, వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలతో పిల్లలకు చదువుకు సాయం అందించారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి సంక్షేమాంధ్రప్రదేశ్‌గా ఏపీ దేశంలో అగ్రపథాన నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, వార్డు ఇన్‌చార్జ్ బడన్నపల్లి కేశవరెడ్డి, 40వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల సంతృప్తి

కదిరి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని ప్రతి ఇంటా సంబరంగా చెప్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బాబా కాలనీ, న్యూ అమీన్ నగర్, శ్రీరాం కాలనీలలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలో ఆయనకు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. జగన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఎలా అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే ఇంటింటా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చెప్పిన వారికే సంక్షేమ ఫలాలు అందేవని, ఈ ప్రభుత్వంలో అర్హులందరికీ సిఫార్సుల్లేకుండా పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యేతో తెలిపారు. బాబా కాలనీ శివారు ప్రాంతంలో ఉన్నందున కదిరి రూరల్ మండలానికి వెళ్లే విద్యుత్ కనెక్షన్ ఇచ్చారని, తరచూ కరెంటు కోత ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ పట్టణానికి సరఫరా అయ్యే విద్యుత్ లైన్ ద్వారా ఈ కాలనీకి విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

గడప గడపకూ ధైర్యంగా వెళుతున్నాం:
ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ప్రతి హామీనీ సీఎం జగన్ అమలు చేశారని, అందుకే తాము ప్రతి గడపకూ ధైర్యంగా వెళ్తున్నామని ఎమ్మెల్యే మీడియాతో అన్నారు.టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెబితే గానీ సంక్షేమ పథకాలు అందేవి కాదని, ఇప్పుడు కులం, మతం, పార్టీలు ఇలాంటివేమీ చూడకుండా అర్హత ఉంటే చాలు.. పథకాలు అందుతున్నాయని ప్రజలే చెప్తున్నారని గుర్తు చేశారు. కౌన్సిలర్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ
కదిరి అర్బన్: గంగన్నగారిపల్లి వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు, 108 వాహనం ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం 11 ట్యాంక్‌లు నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయన్నారు. ఇప్పటికే మద్రిమాకులపల్లిలో రూ.54 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారన్నారు. చిల్లవారిపల్లి గ్రామానికి కూడా తాగునీటి ట్యాంక్ నిర్మాణం కోసం రూ.48 లక్షలు నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. మద్దులచెర్వు గ్రామంలో పంచాయతీ బోరుకు రైతు ఏర్పాటు చేసుకున్న కనెక్షన్ తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ విజయశేఖర్‌కు సూచించారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ భూ రీసర్వేలో భాగంగా తిరుమలాపురం (మోదుగులకుంట) గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మండలంలోని సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యర్రమల కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మ, కో ఆప్షన్ సభ్యులు బాబాఫక్రుద్దీన్, ఈఓపీఆర్డీ కామాక్షి, వైద్యాధికారి మహేంద్రనాథ్ , ఏఓ రమాదేవి, పీఆర్ ఏఈ రవికుమార్, ఏపీఎం సాంబశివుడు, సిరికల్చర్ టీపీ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మున్సిపాలిటీ అభివృద్ధి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, హాజరైన కౌన్సిల్ సభ్యులు

ధర్మవరం: మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయడం ద్వారా ధర్మవరం మున్సిపాలిటీ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో కౌన్సిల్ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అజెండాలోని ప్రధాన అంశాలను మున్సిపల్ సిబ్బంది చదవి వినిపించగా సభ్యులంతా చర్చించి ఏకగ్రీవంగా ఆమోందించారు. అనంతరం వార్డులో పలు సమస్యలపై కౌన్సిలర్లు గళం వినిపించారు. ప్రధానంగా శివారు కాలనీల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలను చర్చించారు. అనంతరం ఇటీవల విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడిన పారిశుధ్య కార్మికుడు లింగన్న చికిత్సకు రూ.1.50లక్షల వరకు ఖర్చు అవుతుందని కౌన్సిలర్ గజ్జల శివ తెలుపగా కౌన్సిలర్లు వేముల జయరామిరెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, గజ్జల శివ, జేసీబీ రమణ, తేజ నెల జీతాన్ని అతడికి అందజేస్తామని ప్రకటించారు.

వ్యక్తిగత కారణాలతో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా
సమావేశం చివరలో మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను రాజీనామా చేస్తున్నానని చెబుతూ రాజీనామా లేఖను అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. రెండేళ్ల తన పదవీ కాలంలో ఎంతో సహకారం అందించి అభివృద్ధి పనులలో భాగస్వామ్యులైన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశమిచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి రుణపడి ఉంటానన్నారు. కౌన్సిల్ సభ్యులు మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి తదితరులు మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమె చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూర నాగరాజు, , కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్ జగన్


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు

ధర్మవరం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను ప్రతి పేదవాడూ తన గుండెల్లో దాచుకున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు అన్నారు. మంగళవారం బత్తలపల్లిలో కోటి కాలనీ, గోవిందచౌదరి బిల్డింగ్ ఏరియా, పాత ఆస్పత్రి, వినాయక నగర్ తదితర ప్రాంతాలలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం


భాస్కర్‌రెడ్డి | లక్ష్మీనారాయణ | నరసింహారెడ్డి

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు పుట్టపర్తి పట్టణ పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్లను నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా మంగళవారం పుట్టపర్తి అర్బన్ పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్, కో-కన్వీనర్ల నియామకాన్ని పూర్తి చేశారు. అర్బన్ బూత్ లెవల్ కన్వీనర్‌గా కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, కోకన్వీనర్లుగా కాన జనార్దన్, బ్రాహ్మణపల్లికి చెందిన సోమశేఖర్‌రెడ్డిలను నియమించారు.

నేడు మండల మీట్

కొత్తచెరువు: కొత్తచెరువు మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గాయత్రి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పోలప్పలు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ: మండలంలోని గుంజేపల్లి సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో కృష్ణాపురం గ్రామానికి చెందిన పుల్లప్ప అనే వ్యక్తి గాయపడ్డాడు. అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీ


ఎగువపల్లి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రామగిరి: కర్ణాటక సరిహద్దులో వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు మంగళవారం తెలిపారు. వచ్చేవారంలో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎగువపల్లి, గరిమేకలపల్లి, పేరూరుడ్యాం, ఏడుగురాకులపల్లి గ్రామాల్లోని చెక్ పోస్టులను తెరిచామన్నారు. ఆ ప్రాంతాల నుంచి వెళ్తున్న బస్సులు, ఆటోలను ద్విచక్ర వాహనదారులను తనిఖీ చేశామన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు

నల్లచెరువు: మండలంలోని నీలవాండ్లపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు రైతు ఆంజనేయులు పొలం వద్ద ఆగివున్న ట్రాక్టర్‌కు మంగళవారం నిప్పంటించారు. స్వయం సహాయక సాగుదారుల సంఘం తరపున నీలవాండ్ల పల్లికి చెందిన ఐదుగురు రైతులకు కలిసి ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేసింది. పొలం పనులు ముగించుకొని ట్రాక్టర్ వదిలి ఇంటికెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధిత రైతు వాపోయాడు.

వక్ఫ్ ఆస్తులు కాపాడాలని వినతి


విజయవాడలో వక్ఫ్‌బోర్డు స్పెషలాఫీసర్‌తో మాట్లాడుతున్న మొగల్‌నూరుల్లా

కదిరి అర్బన్: కదిరి ప్రాంతంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని విజయవాడలోని వక్ఫ్‌బోర్డు స్పెషలాఫీసర్ షిరీన్‌బేగమ్‌కు సత్యసాయి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా మంగళవారం వినతిపత్రం సమర్పించారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను అక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని ఆస్తులు కాపాడతామని స్పెషలాఫీసర్ తెలిపినట్లు వారు చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో గాయజ్‌బాషా, బాషాఖాన్‌తో పాటు మరికొంతమంది ఉన్నారు.

రైతులపై కానిస్టేబుల్ దాష్టీకం


బాధితుడు శంకర్

ఓడీ చెరువు: మండలంలోని ఆకుతోటపల్లికి చెందిన ఇద్దరు రైతులపై స్థానిక పోలీసుస్టేషన్‌కు చెందిన దేవేంద్ర అనే కానిస్టేబుల్ దాష్టీకం ప్రదర్శించాడు. బాధిత రైతుల వివరాల మేరకు.. ఆకుతోటపల్లికి చెందిన రాఘవేంద్ర పొలంలో మంగళవారం రైతులు శంకర్, రాఘవ వేరుశనగ విత్తనం విత్తుతున్నారు. పొలానికి ఉన్న సరిహద్దు రాయి విత్తనం వేసే గొర్రు తగిలి పక్కకు పడింది. దీంతో సరిహద్దు పొలంలోని సాగురైతు నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడని కానిస్టేబుల్ దేవేంద్ర వచ్చి విత్తు వేస్తున్న తమను విచక్షణారహితంగా కొట్టినట్లు బాధితులు వాపోయారు. చెవిపై కొట్టడంతో రాఘవ సొమ్మసిల్లి పడిపోయాడన్నారు. పొలంలో సమస్య ఉంటే ఇరువర్గాలను దండించాలి. లేదా స్టేషన్ పిలిచి మందలించాలి కానీ దాడి చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. పీసీ చేతిలో గాయపడ్డ రైతులను బంధువులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ గోపిని వివరణ కోరగా కొలత రాయిని రైతులు తొలగించడంతో మందలించి పంపించారని, కొట్టలేదన్నారు. కొట్టినట్లు బాధితులు ఫిర్యాదు కూడా చేయలేదన్నారు.

అనుమతులు ఉన్నా చర్చి కూల్చేశారు

- కలెక్టర్, డీఆర్‌ఓకు క్రైస్తవుల ఫిర్యాదు


డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని కొత్తచెరువు మండల కేంద్రంలోని జగనన్న కాలనీ వద్ద ఇటీవల నిర్మించిన బేతల్ హోలీ గాస్పల్ మినిస్ట్రీ చర్చిని రెవెన్యూ అధికారుల సమక్షంలో కూల్చి వేశారని కలెక్టర్ అరుణ్‌బాబుకు, డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. మంగళవారంజిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. చర్చి నిర్మాణం కోసం 2021లోనే 5 సెంట్ల స్థలాన్ని అప్పటి రెవెన్యూ అధికారులు మంజూరు చేయగా దీని నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్‌తో పాటు పంచాయతీ అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అయినా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సోమవారం చర్చిని జేసీబీతో కూల్చి వేశారన్నారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెడ్డివారి నెహమ్య నాగరాజు, బిషప్ వాసు అనిల్, జీఆర్ ఆనంద్, వైపీ బాబు, సుధాకర్, రమేష్‌బాబు, రాజారత్నం, మ్యాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, సచివాలయం ప్రారంభం

తాడిమర్రి: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బుధవారం వైఎస్సార్ క్లినిక్, గ్రామ సచివాలయం ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో 17.5 లక్షలతో వైఎస్సార్ క్లినిక్, రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మించినట్లు ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఏబీ ఓబిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భవనాలను ప్రారంభిస్తారన్నారు. ఉదయం 9.30 గంటలకు జరగనున్న కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

యూటీఎఫ్ ఉద్యమ నిర్మాతకు నివాళి

ధర్మవరం అర్బన్: దాచూరి రామిరెడ్డి ఉద్యమ స్ఫూర్తే ఉపాధ్యాయ లోకానికి దిక్సూచి అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం రామిరెడ్డి వర్ధంతి సభను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, రామకృష్ణనాయక్, రాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, నాగేశ్వరరెడ్డి, వి.రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి

కదిరి టౌన్: కదిరి ఎస్టీఓ ఆఫీస్ పరిధిలోని పెన్షనర్లు ఈ నెల 5లోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఎస్టీఓ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతవరకూ ఈకేవైసీ చేసుకోనివారు వెంటనే చేయించుకోవాలని కదిరి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి తెలిపారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

కొత్తచెరువు: తమ ఇరువురు కుటుంబాల నుంచి ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలంటూ ఓ ప్రేమ జంట మంగళవారం జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని కలసి ఫిర్యాదు చేసింది. వారు తెలిపిన వివరాలమేరకు... తాడిమర్రి మండలం చిల్లకొండాయపల్లి గ్రామానికి చెందిన నాగశివ, సుగుణ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 28న పెళ్లి చేసుకున్నారు. కులాలు వేరైనందున ఇరువురి కుటుంబ సభ్యులు తమపై కోపంతో తమను చంపాలని చూస్తున్నారని నాగశివ, సుగుణ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఎస్పీ మాధవరెడ్డిని కలసి రక్షణ కల్పించాలని విన్నవించామన్నారు.

ఉత్తమ పంచాయతీలకు ప్రశంసాపత్రాలు

తాడిమర్రి: మండలంలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇటీవల జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు, పరిశుభ్రత, సౌకర్యాలు తదితర అంశాలను చూసి పలు పంచాయతీలను అధికారులు అవార్డులకు ఎంపిక చేశారు. దాడితోట, ఏకపాదంపల్లి, పిన్నదరి, తాడిమర్రి ఎం.అగ్రహారం, చిల్లవారిపల్లి ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. దీంతో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు తదితరులు సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యర్రగంగు కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మ, సచివాలయ కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, మారక శివారెడ్డి పాల్గొన్నారు.

5న చేపల చెరువు వేలం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి పంచాయతీలోని బత్తలపల్లి చేపల చెరువును ఈనెల 5న వేలం వేస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పెడపల్లి సెక్రెటరీ తేజశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను చెరువులో చేపలు వదిలి పట్టుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు పీహెచ్‌సీ ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ప్రభుత్వాస్పత్రి భవనం

తలుపుల: మండల కేంద్రంలో నూతనంగా రూ.1.88 కోట్లతో నిర్మించిన ప్రభుత్వాస్పత్రి భవనాన్ని బుధవారం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, వైద్యాధికారులు మున్వర్‌బాషా తెలిపారు.

ప్రజారోగ్యానికి కృషి చేయాలి

తాడిమర్రి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి అహర్నిశలూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాలివ్రయ సాల్మన్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తల సేవలు కీలకమన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఆత్మకూరు ఆశా కార్యకర్త దేవేంద్రమ్మను సన్మానించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చెన్నారెడ్డి, వైద్యాధికారి మహేంద్రనాథ్, జ్యోతిర్మయి, ఎంపీహెచ్‌ఈఓలు మనోహర్‌బాబు, నారాయణస్వామి, ఆరోగ్య కార్యకర్త జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

తనకల్లు: మారప్పగారిపల్లికి చెందిన నరేష్ (28) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. నరేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి తీవ్రం కావడంతో తిరుపతి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల హర్షం

కదిరి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై కదిరి ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సర్వీసులో ఉండి రిటైర్డ్ అయిన, చనిపోయిన ఉద్యోగుల చివరి మొత్తాలను ట్రెజరీ ద్వారా విడుదల చేసేందుకు జీవో విడుదల చేయాలని ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్, ఎన్వీ రమణ డిమాండ్ చేశారు.